







కాళేశ్వరంలో యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, ఆలయ గోపురంపై పూజలు చేస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

హర హర.. మహాదేవా.. శంభో శంకర.. అని దిక్కులు పిక్కటిల్లాయి. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం పరిసరాలు భక్తుల జయ జయ ధ్వానాలతో మారుమోగాయి. నాలుగు దశాబ్దాల తర్వాత జరిగిన మహా కుంభాభిషేకం కన్నుల పండువగా సాగింది. మూడురోజుల పాటు సాగిన ఈ మహా క్రతువు అత్యంత భక్తి శ్రద్ధలతో సాగింది. చివరి రోజు ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తుని శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రధాన ఘట్టం జరిగింది. ఆలయ గోపురంపై గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం జలాలతో వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ అభిషేకం నిర్వహించారు. ఈ మహా ఘట్టానికి మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరయ్యారు. పెద్దఎత్తున భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

- మహదేవపూర్(ఆంధ్రజ్యోతి)

హరోం హర..

కాళేశ్వరాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం

- మూడు రోజులపాటు కన్నుల పండువగా వేడుక
- ఆదివారం ప్రధాన ఘట్టంతో ముగింపు
- శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానందతో మహా క్రతువు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- హాజరైన మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్
- శివనామస్మరణతో మార్మోగిన దేవాలయ ప్రాంగణం

7

కుంభాభిషేకానికి పవిత్ర జలాన్ని తీసుకెళ్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ

నేతన్నకు అభయహస్తం!

చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

- పొదుపు నిధి, భద్రత, భరోసా పథకాల రూపకల్పన
- ప్రస్తుతం 'పొదుపు నిధి'కి దరఖాస్తుల స్వీకరణ
- ఆపై మిగతా కార్యక్రమాల అమలుకు సన్నాహాలు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు (ఫైల్)



జనగామ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు, వారి కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. చేనేత, మరమగ్గాల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం 'చేనేతకు అభయహస్తం' పథకానికి తీసుకొచ్చింది. చేనేతకు అభయహస్తం కింద నేతన్న పొదుపునిధి, నేతన్నకు బీమా, నేతన్న భరోసా పేరుతో మూడు పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి గతేడాది సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయగా జనవరి 10నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది. జీవోతోపాటు మూడు పథకాల అమలు కోసం ప్రాథమికంగా రూ.168 కోట్లను విడుదల చేసింది. ఈ మూడు పథకాల ద్వారా చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులకు ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

మూడు పథకాలు ఒకే గొడుగు కిందకు..

నేతన్న పొదుపునిధి, నేతన్న బీమా, నేతన్న భరోసా పథకాలను ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు చేర్చింది. గత బీఆర్ఎస్ హయాంలో చేనేతకు చేయూత పేరుతో (తెలంగాణ హ్యాండ్‌లూమ్ వీవర్స్ థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ అండ్ సెక్యూరిటీ స్కీమ్) పొదుపు పథకాన్ని అమలు చేసింది. ప్రస్తుతం ఈ పథకాన్ని నేతన్న పొదుపునిధిగా మార్చింది. అలాగే చేనేత కార్మికులు ప్రమాదవశాత్తుగానీ, సహజమరణం కానీ పొందితే బాధిత కుటుంబానికి రూ.5లక్షల బీమాను 'చేనేత బీమా' పేరుతో ప్రభుత్వం అందించింది. కాగా.. ప్రస్తుతం నేతన్న బీమాగా పేరు మార్చారు. చేనేత వృత్తిని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వంలో ముడిసరుకుపై రాయితీని అందించేవారు. ప్రస్తుతం ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. తెలంగాణ మార్క్ లేబుళ్లను ఉపయోగించి నేసిన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు గానూ పని ఆధారంగా ఒక్కో కార్మికుడికి ఏడాదికి రూ. 18000, అనుబంధ కార్మికుడికి ఏడాదికి రూ.6000 చొప్పున నేతన్న భరోసా పేరుతో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేతన్న పొదుపు నిధి

చేనేత కార్మికులకు పొదుపును అలవాటు చేయడంతోపాటు వారిని ఆర్థికంగానూ ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం నేతన్న పొదుపునిధిని తీసుకొచ్చింది. ఈ పథకం కింద చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు కింద జమ చేస్తే అంతే మొత్తంలో ప్రభుత్వం జమ చేస్తోంది. దీనికి ఒక్కో కార్మికుడు గరిష్ఠంగా 8 శాతం అనగా రూ. 1200, అనుబంధ కార్మికుడికి(రంగులు అద్దడం, కండెలు చుట్టడం పనిచేసేవారు) రూ.600 చొప్పున రికరింగ్ డిపాజిట్-1 ఖాతాల్లో ప్రతి నెలా పొదుపు చేయాల్సి ఉంటుంది. దీంతో ప్రతి నెలా ప్రభుత్వం అంతే మొత్తంలో కార్మికుడికి రూ.1200, అనుబంధ కార్మికుడికి రూ.600 చొప్పున రికరింగ్ డిపాజిట్-2 ఖాతాల్లో కార్మికుల పేర్లపై ప్రభుత్వం జమ చేస్తోంది. ఇలా రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది. ఒక్కసారి పొదుపు కార్యక్రమం ప్రారంభమైతే రెండేళ్లు పూర్తయ్యే వరకు డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉండదు. పొదుపు చేయడం మధ్యలో ఆపేసిన వారికి కూడా రెండేళ్లు పూర్తయ్యాకే వారి డబ్బులను ప్రభుత్వం చెల్లిస్తోంది.

నేతన్న బీమా

18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సున్న చేనేత కార్మికులు ప్రమాదవశాత్తు గానీ, సహజ మరణం గానీ పొందితే ఆ కార్మికుడి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం అందించనుంది. ఈ బీమాను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుంది.

జిల్లాలోని లబ్ధిదారులు..

చేనేతకు అభయహస్తం పథకంలోని నేతన్న పొదుపునిధి, నేతన్న బీమా, నేతన్న భరోసా పథకాల కింద జిల్లావ్యాప్తంగా 3,500 మంది చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులకు లబ్ధి జరగనుంది. జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని బచ్చన్నపేటతోపాటు పలు మండలాల్లో చేనేత కార్మికులు, కొడకండ్లలో మరమగ్గాల కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఈ కార్మికులు ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. మూడు పథకాల ద్వారా జిల్లాలోని చేనేత, మరమగ్గాల కార్మికులకు కలిపి ఏడాదికి రూ.10 కోట్ల వరకు లబ్ధి జరగనుంది. గత ప్రభుత్వం చేనేతకు చేయూత కింద(ప్రస్తుతం నేతన్న పొదుపునిధి) చెల్లించి న పొదుపు కాలపరిమితి గత ఆగస్టులో ముగిసింది. కాగా.. జిల్లాలో 2,751 మంది పొదుపు చేసుకున్న కార్మికులకు రెండేళ్లకు రూ.14కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. కాగా.. ప్రస్తుతం కార్మికుల సంఖ్య పెరగడంతో రెండేళ్లలో రూ.20కోట్ల లబ్ధి జరగనుంది.

నేతన్న భరోసా

నేతన్న భరోసా కింద కార్మికుడికి, అనుబంధ కార్మికుడికి ఉత్పత్తి పరిమాణాన్ని బట్టి భరోసా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. ప్రభుత్వం 'తెలంగాణ మార్క్' లేబుళ్లను తయారు చేసి చేనేత కార్మికులకు అందిస్తుంది. ఈ లేబుళ్లు వస్త్ర ఉత్పత్తులపై వచ్చేలా చేనేత కార్మికులు ఉత్పత్తులు తయారు చేయాల్సి ఉంటుంది. కార్మికులు ఉత్పత్తుల పరిమాణాన్ని బట్టి ఒక్కో కార్మికుడికి ఏడాదికి రూ.18వేలు, అనుబంధ కార్మికుడికి రూ. 6వేల చొప్పున మంజూరు చేస్తారు.

ఈనెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలి

జిల్లాలోని చేనేత కార్మికులు, రంగుల అద్దకం, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ వంటి పనులు చేసే అనుబంధ కార్మికులు ఈ పొదుపు పథకంలో చేరవచ్చు. 18 ఏళ్ల వయసు పైబడి ఉండి కనీసం 50 శాతం చేనేత వృత్తి నుంచి ఆదాయం పొందుతున్న వారై ఉండాలి. కార్మికుడు ప్రతి నెలా 8 శాతాన్ని ఆర్డీ-1 ఖాతాల్లో జమ చేసుకుంటే ప్రభుత్వం అంతే మొత్తంలో ఆర్డీ-2 ఖాతాలో జమ చేస్తోంది. రెండేళ్ల కాలపరిమితితో ఈ పథకం ఉంటుంది. పొదుపు డబ్బులను కాలపరిమితి పూర్తయిన రెండేళ్ల తర్వాతే డ్రా చేసుకునే వీలుంటుంది. ఈనెల 15 లోగా చేనేత, జౌళిశాఖ ఏడీ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలి.

- పి.చౌడేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్, చేనేత, జౌళీశాఖ, జనగామ



నాణ్యమైన భోజనమే లక్ష్యంగా ..!



జనగామలో ఓ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

- ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రి
- నేటి నుంచి పంపిణీకి సిద్ధం

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం మరో అడుగు వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులంతా నిరుపేద వర్గానికి చెందిన వారే. వారి అభ్యున్నతికి గాను ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసి భోజనాన్ని సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే వారు వంట చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండంతో వారికి మరింత చేయూత అందించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రధాన మంత్రి పోషణ్ ద్వారా...

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రధాన మంత్రి పోషణ్ పథకం ద్వారా అందిస్తున్నారు. అదే పథకం ద్వారా వంట గదిలో అవసరమయ్యే సామగ్రి కూడా సరఫరాకు సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే టెండర్లు పూర్తి చేయడమే కాకుండా ఈ నెల 10న పాఠశాలలకు వంట సామగ్రిని అందజేయనున్నారు. ఈ మేరకు జనగామ జిల్లాలో 337 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వంట సామగ్రికి గాను జిల్లాకు రూ.44.15 లక్షల నిధులు విడుదల చేసి 10వ తేదీ నుంచి పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు.

సామగ్రి ఇలా ...

ఈ నెల 10 నుంచి పంపిణీ చేసే వంట సామగ్రి వివరాలు ఇలా ఉన్నాయి. గ్యాస్ స్టవ్, 10, 30, 40, 50 కేజీల బియ్యం ఉడికే సామర్థ్యం కలిగిన పెద్ద గిన్నెలు, కూర, సాంబారు తయారు చేసేందుకు గాను 5, 10, 15, 20, 25 కేజీల కూరగాయలు వండే సామర్థ్యం కలిగిన గిన్నెలు, వాటితో పాటు బేసిన్లు, స్టీల్ కంటైనర్లు, స్టీల్ బకెట్లు, స్టీల్ స్పూన్లు ఉన్నాయి. వీటిని 50 మంది వరకు విద్యార్థులు ఉన్న స్కూళ్లు, 51 - 150, 151 - 250, 251 మందికి పైగా విద్యార్థులున్న స్కూళ్లను విభాగాలుగా చేసి అందించనున్నారు.

నేరుగా పాఠశాలలకు ...

ప్రభుత్వం అందించనున్న వంట సామగ్రిని ఈ నెల 10న టెండరుదారులు నేరుగా ఎంపిక చేసిన పాఠశాలలకు అందిస్తారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల సమక్షంలో పంపిణీ జరుగుతుంది. అందించిన సామగ్రి వివరాలు స్టాక్ రిజిస్టరులో నమోదు చేయాల్సి ఉంటుంది. సామగ్రి తీసుకునే సమయంలోనే ఎవైనా పాడైపోయిన వస్తువులు ఉన్నాయా, నాణ్యతాలోపంతో ఉన్నాయా అనేది జాగ్రత్తగా చూసుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సామగ్రి అందించిన తరువాత ఏదైనా డ్యామేజీ ఉన్నట్లయితే తనిఖీ సమయంలో గుర్తిస్తే సీసీఏ నియమ నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

నాణ్యతా లోపంతో ఉంటే తిరస్కరించాలి

ప్రభుత్వ పాఠశాలలకు అందించే వంట సామగ్రిని తీసుకునే సమయంలోనే హెచ్ఎంలు, ఉపాధ్యాయులు జాగ్రత్తగా పరిశీలించాలి. నాణ్యతా లోపంతో ఉన్నట్లయితే వాటిని వెంటనే తిరస్కరించాలి. ఉన్నతాధికారులు తనిఖీ చేసిన సమయంలో వంట సామగ్రిలో లోపాలున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

- ఎం.రమేష్, డీఈవో, జనగామ





రూ.వెయ్యి కోట్లతో స్టేషన్‌ఘనపూర్ అభివృద్ధి

రూ.800 కోట్ల నిధులు ఇప్పటికే మంజూరు

- పరిశీలనలో రూ.200కోట్ల పనులుకు ప్రతిపాదనలు
- కోడ్ ముగియగానే సీఎంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- చేతగానివారు నాపై విమర్శలు చేస్తున్నారు..
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజావాణి వాయిదా

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో పాటు రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణపై ముందస్తుగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రెడ్యా నాయక్

క్రీడలతో మానసికోల్లాసం

మాజీ మంత్రి రెడ్యానాయక్

చిన్నగూడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండాలో శనివారం ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన కబడ్డీ క్రీడలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో నర్సింహులపేట జిల్లా పరిషత్ స్కూల్ గెలుపొందగా, జయ్యారం స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. సీతారాంపురం, కన్నెగుండ్ల స్కూళ్లు తృతీయస్థానం సాధించాయి. బాలికల విభాగంలో మరిపెడ జిల్లా పరిషత్ స్కూల్ గెలుపొందగా, జయ్యారం స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. తొర్రూరు, చింతపల్లి పాఠశాలలు తృతీయస్థానం సాధించాయి. బహుమతుల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహం చెందకుండా గెలుపొందే వరకు పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం డిప్యూటీ సెక్రటరి వెంకన్న, ఆర్‌డీవో వెంకన్న, బానోత్ కృష్ణ, డాక్టర్లు కిరణ్, బాలాజీ, రాములు, ఎంఈవో హిర్యానాయక్, శంకర్‌నాయక్, కొమురెల్లి, ఆయూబ్ పాషా, గంగరాజు, సుక్యానాయక్, చిచ్చు తదితరులు పాల్గొన్నారు.

జన్మస్థలం రుణం తీర్చుకోవాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ముగిసిన తెలంగాణ-ఏపీ వెటరన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



గోవిందరావుపేట విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన గ్రామాలను అభివృద్ధి చేయడం ద్వారా రుణం తీర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. అరుణోదయ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ స్థాయి మాస్టర్స్ ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుంచి మొత్తం 10జట్లు పాల్గొన్నాయి. ప్రథమ విజేతగా ఆంధ్రా యూనివర్సిటీ నిలవగా కాకినాడ జట్టు ద్వితీయ, విశాఖపట్నం జట్టు తృతీయ, గోవిందరావుపేట(బి) జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఆదివారం సాయంత్రం జరిగిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదరణ తగ్గుతున్న బాల్‌బాడ్మింటన్ క్రీడకు పునరుత్తేజం ఇచ్చేలా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వెటరన్ క్రీడాకారులతో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గోవిందరావుపేటలో పుట్టి పెరిగి ఉద్యోగం, వ్యాపార రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకున్న అనేక మంది దేశవిదేశాలలో స్థిరపడ్డారన్నారు. వారంతా పుట్టిన ఊరి అభివృద్ధి కోసం ముందుకు రావాలని కోరారు. గతంలో పలువురు ఓవర్‌హెడ్ ట్యాంకులు, వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు శ్మశాన వాటికలు, రోడ్ల అభివృద్ధికి సొంత నిధులు ఖర్చుచేశారని గుర్తు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తూనే 30కిపైగా కార్పొరేట్ కంపెనీల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, అరుణోదయ యూత్ క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

180 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ములుగు (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదువుతున్న 180మంది విద్యార్థులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లనమంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా పంపిణీ చేశారు. ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. సామాజిక తెలంగాణ వ్యాప్తంగా 116 కళాశాలల్లో చదువుతున్న 3,900 మందికి, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 340 మంది బాలికలకు విద్యకు మద్దతు పథకం కింద స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్టు సంస్థ ఛైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మలబార్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్లకు కలిసొచ్చిన 'కాలం'



రిటైర్‌మెంట్ వయస్సు పెంపుతో ప్రయోజనాలు

ఐదేళ్ల పెంపుతో కేయూలో 77 మందికి ప్రయోజనం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 57 నుంచి 62 ఏళ్లకు పెంచడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న సుమారు 200 మంది ప్రొఫెసర్లకు అదృష్టం కలిసొచ్చింది. ఎన్నో ఏళ్లగా వర్సిటీ ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్‌లు వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని శాఖల్లోని ఉద్యోగుల రిటైర్డు వయస్సును పెంచినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రొఫెసర్లకు వర్తింపజేయాలనే డిమాండ్‌కు ఊపు వచ్చింది. అందరికీ పెంచి తమకు పెంచకపోవడంపై వర్సిటీల్లో పని చేసే ప్రొఫెసర్ల నిరసనలకు దిగారు. ముఖ్యమంత్రిని మొదలుకుని మంత్రులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికా రులకు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు వినతిపత్రాలను అందచేసి తమ రిటైర్డుమెంట్ వయస్సును పెంచాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. కేంద్ర ప్రభు త్వ ఆధీనంలో పనిచేస్తున్న సెంట్రల్ వర్సిటీల్లో ప్రొఫెసర్ల రిటైర్డుమెంట్ వయస్సు 65 వరకు ఉండటంతో తమకు కూడా వర్తిం పచేయాలని డిమాండ్ వచ్చాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ల రిటైర్డుమెంట్ వయస్సు పెంచుతామని ప్రక టించారు. దానికి అనుగుణంగా జనవరి 28న జీవో వెలువరించడంతో వర్సిటీల్లో పని చేస్తున్న ప్రొఫెసర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయా యి. ఈ నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో పనిచేసే ఓ సీనియర్ ప్రొఫెసర్ జనవరి 31న జరిగే రిటైర్డుమెంట్ ఫంక్షన్ వాయిదా వేసి వయస్సు పెంచడంతో వర్సిటీలో పెద్దఎత్తున టపాసులు కాల్చి సంబురాలు చేశారు.

వర్సిటీల్లో పనిచేసే ప్రొఫెసర్లు ఒక్కొక్కరు వారి పర్యవేక్షణలో 8 మందికి పీహెచ్‌డీ

రీసెర్చ్ విద్యార్థులకు మంచి అవకాశం

అడ్మిషన్లు ఇచ్చే వెలుసుబాటు ఉంది. రిటైర్డుమెంట్ పొందే ప్రొఫెసర్ల వద్ద రెండేళ్లకు ముందే రీసెర్చ్ స్కాలర్లను తీసుకునే అవకాశం కోల్పోతారు. గతంలో 57 ఏళ్ల సర్వీస్ ఉండగా, 54 ఏళ్ల వరకే రీసెర్చ్ స్కాలర్లను తీసుకునే వారు. ఇప్పుడు తాజా పెంపుతో ఒక్కో ప్రొఫెసర్ 65 ఏళ్ల వరకు పరిశోధనలకు పరవేక్షకులుగా వ్యవహరించే అవకాశం ఉంది. దీంతో అన్ని విభాగాల్లో వందల సంఖ్యలో విద్యార్థులకు రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుంది.

ఆర్థిక ప్రయోజనాలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రస్తుతం 77 మంది అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల కేటగిరీ రెగ్యులర్‌గా విధుల్లో ఉన్నారు. ఐదేళ్ల పెంపుతో ఒక్కొక్కరికీ ఏటేటా ఇంక్రిమెంట్, 2026లో ప్రకటించే పీఆర్‌సీ ఆర్థిక ప్రయోజనం, సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్లకు అర్హత లభించనుంది. దీంతో పాటు 10 ఏళ్ల ప్రొఫెసర్ అనుభవం వస్తుంది. 10 ఏళ్ల ప్రొఫెసర్ అనుభవంతో భవిష్యత్‌లో వర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్లుగా నియమితులయ్యే జాక్‌పా ట్లను కొట్టేసే ఉజ్వల అవకాశం కలిసివచ్చి నట్లయింది. వయస్సు పెంపు నిర్ణయం ప్రొఫెసర్లకు వీసీకి పదవికి రాజ బాటలు వేసిందని చెప్పవచ్చు.

వర్సిటీల్లో టీచింగ్.. రీసెర్చ్‌కు అనుకూలం..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో ప్రొఫెసర్లు రిటైర్మెంట్‌కు దగ్గరల్లో ఉన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో టీచింగ్ అవసరాల రిత్యా కాంట్రాక్టు, పార్టుటైమ్ పద్ధతిలో బోధన సిబ్బందిని వర్సిటీల్లో నియమించి బోధనను నడిపిస్తున్నారు. అయితే రీసెర్చ్ సూపర్ వైజర్లుగా కాంట్రా క్టు, పార్టుటైమ్ అధ్యాపకులకు అనుమతు ల్లేవు. యూజీ సీ నిబంధనల మేరకు రెగ్యులర్ అసిస్టెం ట్, అసోసి యేట్, ప్రొఫెసర్లకే రీసెర్చ్ గైడ్‌షిప్‌కు అవకాశం ఉంది. దీంతో అన్ని వర్సిటీల్లో అనేక విభాగాల్లో ప్రొఫెసర్లు రిటైర్మెంట్ కావడంతో యువ పరిశో ధకులకు రీసెర్చ్ చేసే అవకాశం లేకుండా పోయింది. కాకతీయ యూనివర్సిటీలో సోషల్ సైన్స్ విభాగాల్లో రాజనీతిశాస్త్రం, లైఫ్ సైన్స్ విభాగాల్లో బాటనీ ఒక్కరూ కుడా రెగ్యులర్ ప్రొఫెసర్లు లేక రీసెర్చ్ గైడ్ల కొరత ఏర్పడుతోంది. ఆయా విభాగాల్లో పీహెచ్‌డీ చేసే అవకాశం లేదు. వయస్సు పెంచకపోతే అన్ని విభాగా ల్లోనూ అదే పరిస్థితి నెలకొనే దుస్థితి ఉండేది. ప్రొఫెసర్ల రిటైర్డు వయ స్సు 62కు పెంచడంతో యూజీసీ నిబంధనల మేరకు వారంతా 65 ఏళ్ల వరకు పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌షిప్ చేసే వెసులుబాటు కలిసి వచ్చింది. గైడ్‌షిప్‌తో వర్సిటీల్లో అనేక మంది విద్యార్థులకు రీసెర్చ్ చేసే మంచి అవకాశం లభించినట్లయింది. అలాగే జాతీయ స్థాయి ఫెల్లోషి ప్‌లు సాధిస్తే వారికి కొంత ఆర్థిక వెలుసుబాటు కూడా లభించే అవకాశం ఉంది.

అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో వర్సిటీకి బలం

వర్సిటీల్లో 2010 తర్వాత రెగ్యులర్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టలేదు. వర్సిటీలో ఇప్పటివరకు పోయే వారే తప్ప వచ్చేవారు లేరు. వర్సిటీల్లో పనిచేసే కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులకు తగిన బోధన, పరిపాలన అనుభవం రెగ్యులర్ వాళ్లతో పోలిస్తే తక్కువ. అనుకుని విపత్కర పరిస్థితుల్లో వర్సిటీల్లో అనుభవజ్ఞులైన సీనియర్ ప్రొఫెసర్లు అవసరం. చాకచక్యంగా వర్సిటీల్లోని సమస్యలను పరిష్కరించే అను భవం సీనియర్లకు ఉంటుంది.

అలాగే న్యాక్ గ్రేడింగ్, యూజీసీ రీసెర్చ్ ప్రాజెక్టులు, రుసా పనులు తదితర కీలకమైన అంశాల్లో నిధులు రావాలంటే అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు కీలకం. వారిచ్చే నూతన ప్రతిపాదనలతో నిధులు వచ్చి వర్సిటీ పరిపుష్టి సాధించే అవకాశాలున్నాయి.

వయస్సు పెంపుతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

వర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ, పీడీఎఫ్, నెట్, స్లెట్, జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్‌తో పాటు తదితర అత్యున్నత డిగ్రీలు సాధించిన నిరుద్యోగులకు ప్రొఫెసర్ల వయస్సు పెంపుతో వారి ఉద్యోగ ఆశలపై నీళ్ళు చల్లినట్లయింది. అయితే వర్సిటీల్లో ఏటేటా నియామకాలు చేపట్టకోవడంతో పాటు అనేక కోర్టు కేసులతో వర్సిటీ బోధన సిబ్బంది భర్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటనలు చేస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఈ దఫా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీ భర్తీపై దృష్టి సారించింది. వర్సిటీల్లో బోధన సిబ్బంది భర్తీ వెంటనే చేపడితే వర్సిటీలు బోధన, రీసెర్చ్‌కి బలం చేకూరుతోంది.

నేటి నుంచి 2 వరకు పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నేపథ్యంలో విజయవాడ సెక్షన్‌లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 10 నుంచి 20 వరకు కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ, భద్రాచలం రోడ్-విజయవాడ ప్యాసింజర్ రైళ్ల అప్ అండ్ డౌన్ రద్దుచేశారు. ఈనెల 11 నుంచి 21 వరకు సికింద్రాబాద్ - గుంటూరు(17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్(17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 21 వరకు అప్ అండ్ డౌన్, గుంటూరు-సికింద్రాబాద్(12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10, 11, 15, 18, 19, 20 వరకు, విజయవాడ-సికింద్రాబాద్(12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్ 11, 14, 16, 18, 19, 20 వరకు అప్ అండ్ డౌన్ రద్దు చేశారు. అనంతరం ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు చెప్పారు.

20 నుంచి జర్నలిజం పరీక్షలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేయూ దూర విద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు తెలిపారు. ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1, 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

మార్చి 4 నుంచి సైకాలజీ సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఎస్సీ సైకాలజీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మార్చి 4, 6, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు మార్చి 15, 16, 17, 18, 19,20 తేదీల్లో బ్యాచ్‌ల వారికీగా జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

ఎంఏ, ఎంకామ్, ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సుల పరీక్షలు

కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకామ్ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి అధికారులు తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషి యాలజీ, ఎంహెచ్‌ఆర్ఎం, ఎంకామ్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్ష లు ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1, 2, 3వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

చెరువులో పడి ఒకరి మృతి



ఎం నాగేందర్ (ఫైల్)

మహదేవపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన ఎం. నాగేందర్ (46) మద్యానికి బానిసై ఊర్ల వెంట తిరుగున్నాడు. మహదేవపూర్‌కు వచ్చిన అతడు తాగిన మైకంలో ఎర్ర చెరువులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.



వెల్లికట్ట గ్రామంలో ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఉపేందర్

శాంతియుతంగా

ఎన్నికల్లో పాల్గొనాలి


తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా గ్రామస్థులు కృషి చేయాలని ఎస్సై ఉపేందర్ తెలిపారు. మండలంలోని వెల్లికట్టలో ఆదివారం వివిధ పార్టీ రాజకీయ నాయకులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు జరగాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

మిర్చి కొనుగోల్‌మాల్

- తూకంలో తేడాలు.. నష్టపోతున్న రైతులు
- 450 గ్రాముల వరకు.. చిట్టా బుక్కుల్లోనూ రాయని వైనం
- నగదు చెల్లింపులకూ కమీషన్ కట్
- పట్టించుకోని మానుకోట మార్కెట్ అధికారులు



కాంటాలో 36 కిలోల 900 గ్రాములు ఉన్నట్లు చూపుతున్న తూకం



దడువాయిల కాంటా చిట్టా బుక్కులో అర కిలో వరకే రాస్తున్న దృశ్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సరుకులు కాంటా వేసే సమయంలో లెక్కల్లో గోల్‌మాల్ జరుగుతోంది. రైతులు కళ్లెదుటే దడువాయిలు, హమాలీల సాక్షిగా కాంటాల్లో లెక్కలు తేడాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చిట్టా బుక్కుల్లోనూ రాయడం లేదు. ఈ కారణాలతో రైతులకు రూ.లక్షల్లో నష్టం జరుగుతున్నా.. మార్కెట్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. మార్కెట్‌లో కాంటాల్లో లెక్కల వివరాలు నమోదు చేయడానికి పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలు ఉన్నా, వాటిని ఉపయోగించకుండా మూలకు పడేశారు.

లెక్కలు రాయడంలో వ్యత్యాసం

వ్యవసాయ మార్కెట్‌లో సరుకు కాంటాలు వేసే సమయంలో లెక్కల్లో గోల్‌మాల్ జరుగుతోంది. రైతులు ఎదుటే కాంటాలు వేస్తున్నా 450 గ్రాముల తూకం వరకు లెక్కల్లో రాయడం లేదు. ఉదాహరణకు 36 కిలోల 950 గ్రాముల తూకం వస్తే 36 కిలోల 500 గ్రాముల వరకు మాత్రమే తూకంలో లెక్కలు రాస్తున్నారు. అంటే పైనున్న సుమారు 450 గ్రాముల వరకు రాయడం లేదు. ఇంకో బస్తాలో 36 కిలోల 450 గ్రాముల తూకం ఉంటే .. కేవలం 36 కిలోలు మాత్రమే తూకంలోకి తీసుకుంటున్నారు. దీంతో రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. రైతు తెచ్చిన మిర్చిలో మొత్తం కాంటా అయిన తర్వాత చివరి మూట ఉంటే ఆ మూటకు ప్రత్యేకంగా రూ.500 నుంచి రూ.1000 వరకు ధర తగ్గించి, అదనంగా మరో కిలో వరకు తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 50 కిలోల బస్తా దాటితే అదనంగా మరో కిలో కట్ చేస్తున్నారు. హమాలీ, దడువాయి, గుమస్తాల పేర్లపై ఒక్కొక్క బస్తాకు రూ.20 నుంచి రూ.23 వరకు కట్ చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కాగా, గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో ఆనవాయితీగా వస్తున్న సిస్టం ప్రకారమే ఖరీదు చేపడుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

నామ్‌కే వాస్తే చిట్టాబుక్కులు

గత కొన్నేళ్లుగా అమల్లో లేని దడువాయిల కాంటా చిట్టాబుక్కు 15 రోజుల కిందట ప్రారంభించారు. చిట్టా బుక్కులు కూడా నామ్‌కే వాస్తేగా మారాయి. వాటిలో అరకిలో వరకే రాస్తుండగా పైన అధికంగా ఉన్న 450 గ్రాములకు లెక్కలు రాయడం లేదు. చిట్టా బుక్కులను రాసిన తర్వాత మార్కెట్ అధికారులకు సమర్పిస్తారు. దాని ప్రకారం.. మార్కెట్ అధికారులు తక్ పట్టీలను తెప్పించుకోవాల్సి ఉంటుంది. అవి మార్కెట్‌కు ఇవ్వకుంటే అది జీరో కిందనే లెక్కవుతుంది. గతేడాది ఈ మార్కెట్‌కు రూ. 2,23,852 బస్తాల మిర్చి కొనుగోళ్లు జరిగాయి. అయితే మార్కెట్‌లో ఎన్ని తక్ పట్టీలు వచ్చాయో.. మార్కెట్‌కు ఎంత ఫీజు వచ్చిందో అధికారులకే తెలియాలి. ఈ-నామ్ మార్కెట్‌గా మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఉన్నా పీవోఎస్ యంత్రాలు వచ్చి ఏడాది పైగా అవుతున్న పీవోఎస్ యంత్రాలను మార్కెట్‌లో వాడడం లేదు. పీవోఎస్ యంత్రాలను వాడితే ప్రతి 50 గ్రాముల వరకు లెక్కల్లోకి వస్తాయి. ఆ విధంగా తక్ పట్టీలు వచ్చి మార్కెట్ ఆదాయం పెరిగేందుకు అవకాశం ఉంది.

నేరుగా నగదు చెల్లిస్తే..

వ్యవసాయ మార్కెట్‌లో నగదు చెల్లింపుల్లో వ్యాపారులు కోతలు విధిస్తున్నారు. రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తే నూటికి 1 శాతం, నగదు నేరుగా చెల్లిస్తే 2 శాతం కట్ చేసుకుని రైతులకు ఇస్తున్నారు. కాంటాల్లో కూడా తేడాలు వస్తున్నాయని వ్యాపార వర్గాలు, దడువాయిలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వ్యాపార వర్గాలు, కాంటాల్లో తేడా వచ్చి తాము నష్టపోతున్నామని, వాటిని సరి చేయడం, లేదా కొత్త కాంటాలను తెప్పించి పెట్టించాలని వ్యాపారులు మార్కెట్ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. దడువాయిలు కూడా కాంటాలు మార్చి కొత్తవి తెప్పించాలని వినతి పత్రాలు సమర్పించారు. కాంటాలు ఉన్న రూమ్ నుంచి యార్డుల వరకు కాంటాలను లాక్కొని పోవడంతో వైర్లు కదిలి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. కొత్త కాంటాలు మార్చి షెడ్లలో ఉంచితే తూకాల్లో తేడాలు వచ్చే అవకాశం ఉండదని రైతులు చెబుతున్నారు.

సక్రమంగా తూకాలు జరిగేలా చర్యలు

ఈ సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్, మహబూబాబాద్



వరంగల్, ఖమ్మం మార్కెట్లలో ఏ విధంగా మిర్చి కొనుగోలు చేస్తున్నారో, అలాగే ఈ మార్కెట్‌లోనూ తూకాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. దడువాయి చిట్టా బుక్కుల్లో ప్రతీ వంద గ్రాములపైన ఉంటే రాసేలా చర్యలు తీసుకుని జీరో జరుగకుండా జరిగిన కొనుగోళ్లకు తక్ పట్టీలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. మార్కెట్ ఆదాయం పెంపొందించే దిశలో ప్రయత్నం చేస్తాం. కాంటా చార్జీలు ఇష్టం వచ్చిన రీతిలో వసూలు చేస్తున్నారని, రైతులు నుంచి ఫిర్యాదుల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.



బాలలకు బలం బాలామృతం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాలను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతాన్ని పంపిణీ చేస్తోంది. ఏడు నెలల వయసు నుంచి మూడేళ్ల వయసు వరకు పిల్లలకు ప్రతి నెలా 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్‌ను అందిస్తున్నారు. ఎంతో బలవర్ధకమైన బాలామృతం గురించి అవగాహన లేని అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తినిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో బాలామృతం గేదెలకు సైతం పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తప్పనిసరిగా తినిపించాలి

పిల్లల ఆరోగ్యానికి ఎంతోమేలు చేసే బాలామృతాన్ని తప్పనిసరిగా తినిపించాలని శిశు సంక్షేమశాఖ అధికారులతోపాటు వైద్యులు సైతం సూచిస్తున్నారు. మరోవైపు బలహీనంగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్‌ను సైతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాదికాలంగా పంపిణీ చేస్తున్నారు. బాలామృతం ప్లస్‌లో పోషకాల శాతం కొద్దిమేర ఎక్కువగా ఉంటుంది.

ఉండే పదార్థాలు

బాలామృతం, బాలామృతం ప్లస్‌లో వేయించిన గోధుమలు, శనగపప్పు, పాలపొడి, పల్లీలు, చక్కెర, నూనెతో పాటు కాల్షియం, ఐరన్, విటమిన్ ఏ, బీ1, బీ2, బీ12, సీ, ఫోలిక్ యాసిడ్, నియాసిన్, జింక్‌లుసైతం ఉంటాయి.

కలిగే ప్రయోజనాలు

పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. పిల్లల్లో ఆకలిని పెంచుతుంది. రక్తహీనత, బలహీనతను నివారిస్తుంది. కంటిచూపు మెరుగు పడుతుంది.

హరోం హర..

- కాళేశ్వరాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం
- శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానందతో మహా క్రతువు
- మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం హాజరు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం


ప్రవచనాలు వింటున్న మంత్రులు ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

మహదేవపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రాచీన పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాకుంభాభిషేకం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కనులపండువగా సాగిన ఈ వేడుక ఆదివారం ముగిసింది. చివరి రోజు మహా క్రతువును భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తుని శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రధాన పట్టం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

గోదావరి ప్రాణహిత సరస్వతి నదుల త్రివేణి సంగమం ఒడ్డున కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం 43 ఏళ్ల తర్వాత జరిగింది. 1982 తర్వాత మళ్లీ ఇప్పుడు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభామేళా జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో మహా కుంభాభిషేకాన్ని మూడు రోజుల పాటు (శుక్ర, శని, ఆదివారాలు) నిర్వహించారు. ఆదివారం ఉదయం సరిగ్గా 10.42 గంటలకు ప్రధాన ఘట్టం జరిగింది.

శత చండీ పారాయణం, సహస్ర ఘట్టాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి సహస్ర ఘట్టాలతో విశేష అభిషేకాన్ని ఘనంగా జరిపారు. వేద పండితులు, మంత్రోచ్ఛరణ మధ్య శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమం గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో మహేష్, అర్చకులు పణకంటి నగేష్‌శర్మ, కృష్ణమూర్తి శర్మ, వేద పండితుడు పాండే సుబ్రహ్మణ్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాజరైన మంత్రులు

మహాకుంభాభిషేకం వేడుకకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాగా, కాళేశ్వరాలయంలో వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామికి పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి ప్రవచనాలను ఎంత భక్తిశ్రద్ధలతో ఆలకించారు. ఎమ్మెల్సీ ఎన్నికలత కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులెవరూ మాట్లాడలేదు. ఎన్నికల అధికారి అనుమతి మేరకు దర్శనానికి మాత్రమే తాము హాజరైనట్లు వారు తెలిపారు.

భక్తులకు కృతజ్ఞతలు

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన మహా కుంభాభిషేకం విజయ వంతంగా నిర్వహించడం పట్ల కలెక్టర్ రాహుల్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ మహోత్సవంలో భాగస్వాములైన విశేష సేవలు అందించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. కుంభాభిషేకంపై ప్రచారం కల్పించిన పాత్రికేయులకు, జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు పాటిస్తూ సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ గోపురం పైన పూజలు చేస్తున్న పూజారులు




గోపురం వద్ద పూజలో మంత్రులు


కలశాల వద్ద పూజలు చేస్తున్న స్వామీజీ, భక్తులు

ఒకే పానపట్టంపై రెండు లింగాలు

కాళేశ్వరాలయం ఎంతో పవిత్రమైనదని, ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉండడం విశేషమని తపోవన సచ్చిదానంద సరస్వతి స్వామి తెలిపారు. మూడు నదుల సంగమం వద్ద ఉన్న దేవాలయం ఎంతో విశిష్టమైనదని తెలిపారమహా కుంభాభిషేకం సందర్భంగా ఆయనప్రవచనాలు చేశారు. శివుడు లయకారుడన్నారు. శివుడిని పూజిస్తే సకల పాపాలు హరిస్తాయని పేర్కొన్నారు. మహా కుంభాభిషేకం ద్వారా ఆలయ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని తెలిపారు. యంత్రశక్తి, మంత్రశక్తి తోడుగా దేవుడి అనుగ్రహం ఉంటుందన్నారు. భక్తుల కల్పతరువుగా కాళేశ్వరం విరజిల్లుతోందన్నారు.


బలి ప్రదానం చేస్తున్న అర్చకులు

రూ.వెయ్యి కోట్లతో స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి

కోడ్ ముగియగానే సీఎంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు : ఎమ్మెల్యే శ్రీహరి

హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఏడాదికాలంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ రూ.1000 కోట్లలో రూ.800 కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయని, మరో రూ.200కోట్ల పనుల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు.

ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించగలిగానని, జఫర్‌గఢ్ మండలం కోనాయచలంలో రూ.200కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న ఈ పాఠశాలలో భాగంగా ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం నాలుగు గురుకులాలు ఏర్పాటవుతాయని శ్రీహరి తెలిపారు. నియోజకవర్గం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించానని, జాతీయ రహదారి పక్కన గతంలో ఆర్టీసీ బస్సు డిపో కోసం ప్రతిపాదించిన నాలుగు ఎకరాల స్థలంలో ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.40.40కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. 22 ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా తెలంగాణలో మొదటిసారిగా నియోజకవర్గం కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ మంజూరైందని, 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.26కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. దేవాదుల రెండోదశ ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించేందుకు ఆర్ఎస్ ఘన్‌పూర్ మెయిన్ కెనాల్ కాలువకు, డిస్ట్రిబ్యూటరీలకు సిమెంట్ లైనింగ్ పనులు మంజూరయ్యాయని, రూ.148.76కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు టెండర్లు పిలవడం పూర్తయిందన్నారు.

నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని, ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాల భవనంలో ఈ 2025-26 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.30కోట్లు విడుదలయ్యాయని కడియం తెలిపారు. రూ.53కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో డివిజనల్ ఆఫీసు భవనం నిర్మాణానికి టెండర్లు పిలవడం పూర్తయిందని, అలాగే రఘునాథపల్లి మండలం కురుచపల్లి, జఫర్‌గఢ్ మండలం సాగరం, చిల్పూర్ మండలం కొండాపూర్‌లో రూ.10కోట్లతో మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనున్నట్లు చెప్పారు. రూ.25 కోట్లతో ఉపాధి హామీ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, విద్యా తది తర శాఖల ఆధ్వర్యంలో వివిధ పనులు మంజూరు పురోగతిలో ఉన్నాయన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అదనంగా మరో 1500 మంజూరు చేయించానని, రూ. 250 కోట్లతో నిర్మించనున్న ఈ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పా రదర్శకంగా పంపిణీ చేస్తామన్నారు. రూ. 15 కోట్ల ఎంపీ లాడ్స్, ఎన్ ఆర్‌ఈజీ ఎస్ నిధు లతో కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రూ.180కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించానని ఎమ్మెల్యే తెలిపారు. ఘనపూర్, శివుని పల్లె, ఛాగల్లు గ్రామాలను కలిపి ఘనపూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిందని, ఇటీవలే పనిచేయడం ప్రారంభమైందని వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలోని ఇనుపరాతి గుట్టలను (దేవునూరి గుట్టలు) ఎకో టూరిజం పార్కుగా తీర్చిదిద్దే పెద్ద ప్రాజెక్టు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా ధర్మసాగర్ చెరువు బండ్‌ను ఆధునీకరించడంతో పాటు ఈ కట్ట నుంచి గుట్టల వరకు లక్నవరం తరహాలో సస్పెన్షన్ బ్రిడ్జిని నిర్మిస్తారని, పార్కులో సైకిల్ ట్రాక్, ట్రెక్కింగ్, చెరువులో బోటింగ్ తదితర సౌకర్యాలను కల్పిస్తారని వివరించారు. ఎకో టూరిజం పార్కు డీపీఆర్‌ను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు శ్రీహరి చెప్పారు. ఎమ్మెల్సీ కోడ్ అయిపోగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయిస్తామని తెలిపారు. మంజూరైన పనులన్నీ 18 నెలల్లో పూర్తి చేయిస్తామని శ్రీహరి ప్రకటించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చేతగానివారు విమర్శించడమా ?

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తనను చేతగానివారు, అవినీతిపరులు విమర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్యపై కడియం శ్రీహరి పరోక్షంగా ధ్వజమెత్తారు. ఈ పనులన్నీ గతంలోనే మంజూరయ్యాయని చెప్పడాన్ని ఖండించారు. ఏడాది కాలంలోనే మంజూరయ్యాయడానికి సాక్ష్యంగా జీవోలు, తేదీలతో సహా వివరించారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉండి ఏం చేయలేని వ్యక్తి.. తనపై చౌకబారు విమర్శలు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, స్టేషన్‌ఘనపూర్ మునిసిపాలిటీగా స్థాయి పెంపు వంటి చిన్న పనులపై దృష్టిపెడితే అయ్యేవని, కానీ అదేం పట్టించుకోలేదన్నారు. ఆయనకు వేరే సోకులు ఉండేవి అంటూ ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 20 ఏళ్ల తర్వాత తిరిగి ఎమ్మెల్యే అయిన తాను స్టేషన్‌ఘనపూర్ నియోజకర్గ అభివృద్ధికి శక్తిమేరకు కృషి చేస్తున్నానని కడియం పునరుద్ఘాటించారు.



ముస్తాబైన పగిడిద్దరాజు ఆలయం

19 నుంచి పగిడిద్దరాజు జాతర

- పూనుగొండ్లలో ముస్తాబైన ఆలయం
- 3 రోజులు మొక్కులు చెల్లించుకోనున్న భక్తులు

గంగారం(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలంలోని పూనుగొండ్లలో కొలువై ఉన్న గిరిజనుల ఆరాధ్యదైవం సమ్మక్క భర్త పగిడిద్దరాజు మిని జాతరకు దేవాలయం ముస్తాబైంది. మేడారం సమ్మక్క, సారక్క ఆలయ కమిటీ నుంచి నిధు లు రావటంతో ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఈ నెల 12వ తేదీన మేడారంలో జరిగే మినీ జాతరకి పెండ్లి కుమారుడిగా పగిడిద్దరాజు ముస్తాబై వెళ్లి వచ్చిన తర్వాత.. 19న పూనుగొండ్లలో జాతర ప్రారంభమవుతుందని అర్చకుడు పెనక రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ జాతర మూడు రోజులు జరుగుతుందని వివరించారు. పూనుగొండ్లలో జరిగే ఈ జాతరకు పెనక వంశస్థులతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనక పురుషోత్తం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రధాన పూజారి పెనక రాజేశ్వర్


గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు ఆలయం

టాయ్ కాదు.. టీచర్

- గుడ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పే 'సంస్కార్' బొమ్మ
- ఇప్పటివరకు 65 వేల మంది విద్యార్థులకు అవగాహన
- ఏడు భాషల్లో మాట్లాడేలా తయారీ
- ఆవిష్కరించిన వరంగల్ వాసి గణేష్
- ప్రశంసించిన ప్రధాని నరేంద్ర మోదీ

మామునూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. అభంశుభం తెలియని చిన్నారులను సైతం కామాంధులు వదిలిపెట్టడం లేదు. ఇలాంటి సంఘటనలు మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అనేక సందర్భాల్లో తెలిసిన వాళ్ళే ఈ దుశ్చర్యకు ఒడిగడుతున్నారు. ఏ ఉద్దేశంతో అమ్మాయిలను తాకుతున్నారో చిన్నపిల్లలు గుర్తించలేరు. ఈ నేపథ్యంలో మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి పిల్లలకు అవగాహన కల్పించడం అవసరం. అయితే తల్లిదండ్రులు ఇలాంటి విషయాలు పిల్లలతో మాట్లాడటానికి సాధారణంగా ఇష్టపడరు. ఈ సమస్యను గమనించిన వరంగల్‌కు చెందిన ఓ యువకుడు పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి పిల్లలతో మాట్లాడటానికి ఓ బొమ్మను తయారు చేశాడు. దానికి 'సంస్కార్ ఆద్య' అని పేరు పెట్టాడు. పాఠశాలల్లో ఆడపిల్లలకు చదువుతో పాటు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్నాడు.

30కి పైగా ఆవిష్కరణలు

వరంగల్ జిల్లా నందనం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన యాకర గణేష్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అయిదు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ అందుకున్నాడు. గణేష్ ఘనత గురించి 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసించారు. కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న తన తల్లి కష్టం చూడలేక పదకొండేళ్ల వయసులో హ్యాండ్ ఫ్యాన్ తయారు చేశాడు. ఇలా నాటి నుంచి నేటి వరకు 30కి పైగా వివిధ పరికరాలను ఆవిష్కరించారు. అందులోంచి పుట్టిందే సంస్కార్ బొమ్మ. దాని పేరు ఆద్య.



బొమ్మలతో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, గణేశ్, అధికారులు


సంస్కార్ బొమ్మ(ఆద్య)ను ఆవిష్కరిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

ఒక్క మాటలో చెప్పాలంటే సంస్కార్ ఆద్య అనేది మాట్లాడే బొమ్మ. ఆద్యను ఛాతి ప్రాంతంలో తాకితే అక్కడ తాకకూడదు అంటూ హెచ్చరిస్తుంది. ఇలా శరీరంలో ఎక్కడ ప్రైవేట్ పార్ట్స్‌ను తాకినా వెంటనే అరుస్తుంది. అంతేకాదు ఆపదలో ఉన్నప్పుడు ఏం చేయాలో కూడా చెపుతుంది. హెల్ప్‌లైన్ నంబర్లను సైతం చెప్పేస్తుంది. సైబర్‌క్రైం గురించి, డ్రగ్స్ గురించి హెచ్చరిస్తుంది. ఇందులో బాయ్ వర్షన్ కూడా ఉంది. దాని పేరు ఆదిత్య. అబ్బాయిలకు ఆడపిల్లలతో ఎలా మసలుకోవాలో చెపుతుంది. అంతే గాకుండా వినికిడి, చూపు లేని పిల్లలను సైతం గైడ్ చేస్తుంది. లైంగిక వేధింపులు, బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. వీటిని ప్రతీ జిల్లాలో పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, బాలికల వసతి గృహాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, షాపింగ్ మాల్స్ ప్రధాన కూడళ్ల వద్ద శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రోబో తయారు చేస్తా..

వై. గణేష్, సంస్కార్ బొమ్మ రూపకర్త



చిన్నప్పటి నుంచి నాకు సైన్స్ అండ్ టెక్నాలజీ అంటే ఇష్టం. దీనికి సంబంధించి నాకు ఫార్మల్ ఎడ్యుకేషన్ ఏమీ లేదు. యూట్యూబ్ చూసే నేర్చుకున్నాను. ఇన్నోవేటివ్ మైండ్ సెట్ ఉన్నవాళ్లకు ఓ ప్లాట్ ఫామ్ తయారు చేయాలన్నదే నా లక్ష్యం. ఫ్యూచర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఒక రోబో తయారు చేసి దానితో పిల్లలకు మరింత అడ్వాన్స్ నాలెడ్జ్ అందజేస్తా. అందుకే సంస్కార్ ఎలక్ట్రానిక్స్ అనే స్టార్టప్ పెట్టాను.

వేలాది మందికి అవగాహన

గణేష్ రూపొందించిన సంస్కార్ బొమ్మ ఇప్పటి వరకు 65 వేల మంది విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి అవగాహణ కల్పించింది. ఈ బొమ్మను ఉపయోగించడం చాలా సులువు. ఎవరైనా బొమ్మ ప్రైవేట్ భాగాలపై చేతులు ఉంచితే అది వెంటనే ముట్టుకోవద్దు అని అరుస్తుంది. సంస్కార్ బొమ్మ ఇచ్చే ఆడియో సిగ్నల్స్ కోసం గణేష్ తనస్నేహితులతో పాటు వేర్వేరు వ్యక్తుల వాయిస్‌లను రికార్డ్ చేశారు. ప్రస్తుత కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సైతం వాయిస్ ఇచ్చారు. దీన్ని మొదట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ బొమ్మ తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ, తమిళం, కన్నడ మళయాలం, కొంకణీ భాషలలో మాట్లాడగలదు.




సంస్కార్ ఆద్య, ఆదిత్య బొమ్మలు


విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్న గణేష్



గణేష్ అందుకున్న మెడల్స్

ఆన్‌లైన్‌లో ఎవరైనా బుక్ చేసుకోవచ్చు

సంస్కార్ బొమ్మ కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ధర రూ.3500 చెల్లిస్తే ఇంటివద్దకే కొరియర్ లో వస్తుంది.

ఆడపిల్లలకు అవగాహన తప్పనిసరి

ఎస్పీ పూజ, మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్



గుడ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన ఉండాలి. ఈ విషయంపై స్కూల్లో టీచర్లతో పాటు ఇంట్లో తల్లిదండ్రులు కూడా వారికి వివరించాలి. గణేష్ తయారు చేసిన సంస్కార్ బొమ్మ బాగుంది. ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుంది. సమాజంలో పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

రేపటి నుంచి శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాలు

నర్మెట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నర్మెట మండలకేంద్రంలో కాకతీయుల కాలం నాటి శివాలయం శిథిలావస్థకు చేరగా దాతలు, గ్రామస్తుల సహకారంతో గంగం నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో శివాలయాన్ని పునర్నిర్మాణం చేశారు. వేద పండితుడు. బ్రహ్మ శ్రీ పురాణం మహేశ్వర శర్మ శివాలయానికి కాశీ విశ్వనాథ శివాలయం నామకరణం చేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ధ్వజ పంచాయతన నవగ్రహ సమేత కాశీ విశ్వనాథ శివలింగ ప్రతిష్ఠామహోత్సవాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి తెలిపారు.



నర్మెటలో మహోత్సవాలకు సిద్ధమవుతున్న శివాలయం

మహోత్సవాల తీరు ఇలా...

ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే మహోత్సవాల ముందు రోజు నేడు(10)న గ్రామంలో విగ్రహాల ఊరేగింపు శోభాయాత్ర నిర్వహిస్తూ విగ్రహాలకు హారతులు, జలాభిషేకం నిర్వహించబడును. 11 తేదీన ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, అరణిమధనం, యాగశాల ప్రవేశం, మండపరాధన, జలదివాసం 12న ఉదయం స్థాపిత దేవతా హోమాలు, స్నపనం, శయ్యాధివాస, ధాన్యాధివాస, పుష్పాదివాసములు జరుగుతాయి. 13న శివపంచాయతన సుబ్రహ్మణ్య ఆంజనేయ ధ్వజ నవగ్రహ సహిత శ్రీ కాశీ విశ్వనాథ లింగ ప్రతిష్ఠ చేసి ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, బలిప్రధానం, మహానీరాజనం, ఆశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయి. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడును. మహోత్సవాలు జరిగే మూడు రోజులు అన్నప్రసాద వితరణ జరుగును.

ప్రముఖులకు ఆహ్వానం

మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులకు ఆహ్వానం అందించినట్లు కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, మండల నాయకులకు ఆహ్వానం అందించారు. పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం..
ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి



కాశీ విశ్వనాథ శివాలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మాణాన్ని చేసుకున్నాం. వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ప్రత్యేక పూజలతో కాశీ విశ్వనాథ శివలింగ ప్రతిష్ఠా మహోత్సవాలను మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో నిలిచే అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగిటి విద్యానాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో జరిగిన పార్టీ కార్యక ర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాళ తీయించిన బీఆర్ఎస్ పార్టీ నీతులు వల్లిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లడుగుదామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, గ్రామశాఖ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, ఆరుగొండ విజయ్ కాంత్, నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడియంను విమర్శించే స్థాయి పోచంపల్లికి లేదు

రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా అనేక ఉన్నత పదవులు చేబట్టి ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో తనకుంటు రాజకీయంగా ఒక గుర్తింపు తెచ్చుకున్న మహానేత కడియం పై పిచ్చి కూతలు కూయడం సరికాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బెలిదె వెంకన్న

జనగామ జిల్లాను కరువు కోరల నుంచి సస్యశ్యామలం చేయడానికి దేవాదుల పథకాన్ని తీసుకువచ్చిన అపర భగీరథుడు కడియంను విమర్శించే నైతికత ఎవరికి లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేయాలనే ఉన్నత లక్ష్యంతో పార్టీ మారిన వ్యక్తి కడియం అన్నారు. పార్టీ మారాడని ఎవరు ఎన్ని విమర్శలు చేసినా నియోజక వర్గ ప్రజలు మాత్రం కడియం వెన్నంటి ఉన్నారని అందుకు నిదర్శనం ఎంపీ ఎన్నికల్లో కడియం కావ్యకు ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి 55వేల మెజార్టీ రావడమేనన్నారు. ఇప్పటికైన నాయకులు స్థాయిని మరిచి విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మరో మారు చౌకబారు విమర్శలు ఎవరైనా చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్పడం ఖాయ మన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు తోట వెంకన్న, దైద ఎలిషన్, దుంపల పద్మారెడ్డి, మాచర్ల కుమార స్వామి, ఆకుల కృష్ణంరాజు, గాదె చంద్రయ్య, దుంపల సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

చిలుపూర్, ఫిబ్రవరి 9 : రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో పరస్పరం దాడికి పాల్పడ్డ పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మల్కాపూర్‌కు చెందిన కొమ్మురాజుల రాణి -రాజశేఖర్ దంపతులకు నాలుగేళ్ళ క్రితమే వివాహం కాగా, వారికి ఓ చిన్నారి కుమార్తె ఉంది. అదనపు కట్నం విషయంలో కొద్దిరోజులుగా రాజశేఖర్ అతడి భార్య రాణిని వేధింపులకు గురి చేస్తున్నాడు. సమాచారమందుకున్న ఆమె తల్లిదండ్రులు శనివారం రాత్రి మల్కాపూర్‌కు చేరుకుంటారు. ఇరు కుటుంబాల మధ్య మాటా మాట పెరగడమే కాకుండా ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. శివరాత్రి వెంకట్రాజం, కొమ్మరాజుల రాజయ్య ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇరు పక్షాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్టాండ్‌లో బెంచీలు ఏర్పాటు

పాలకుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం బెంచీలను ఏర్పాటు చేసినట్లు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల కోసం రూ. 20 వేలు విలువ గల బేంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై లింగారెడ్డి, ఎంఈవో పోతుగంటి నర్సయ్య ఉన్నారు.



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బేంచీలు

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన గౌడ జన హక్కుల పోరాట సమితి జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు బైరు బాలరాజుగౌడ్ సతీమణి బైరు మల్లికాంబ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్ ఆదివారం మృతురాలి ఇంటిని సందర్శించి ఆమె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలరాజును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లుగౌడ్, బైరు నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



బైరు మల్లికాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యెలికట్టి విజయ్‌కుమార్

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నేత జువారి రమేశ్

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు జువారి రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉప్పుగల్లులో సీపీఐ ప్రతినిధుల సమావేశం మంద బుచ్చయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ హామీలను అమలు చేసిన తరువాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. లేనిచో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, సన్న ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు బోనస్ డబ్బులు జమ చేయలేదన్నారు. రైతు భరోసా పథకం సైతం అన్నదాతలను దగా చేసేలా ఉందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల ప్రతినిధులు ఎండి.యాకూబ్‌పాషా, పెండ్యాల సమ్మయ్య, ఎండి.జాఫర్, రాజు, సాయిలు, రాములు, రవి, లక్ష్మయ్య, సతీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కడియం చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు రూ 75వేల నగదుతో పాటు బియ్యం అందిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి మూడు కుటుంబాలు నివాసముంటున్న ఇల్లు దగ్ధమైన సంఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ద్వారా వచ్చిన రూ 75వేల నగదును ఆదివారం నాయకులు అందించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఒక క్వింటాళ్ బియ్యం చొప్పున అందించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్యశిరీష్ రెడ్డి మాట్లాడుతూ భాదితులు ఆధైర్యపడవద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అండగా ఉన్నారని వారిలో ధైర్యం నింపారు. అర్థిక సాయం అందించడంతో పాటు మూడు కుటుంబాలకు మూడు ఇందిరమ్మ ఇండ్లను కడియం ప్రకటించారని నియోజకవర్గంలో మొదటి మూడు ఇందిరమ్మ ఇండ్లు భాదిత కుటుంబాలకు అందిస్తారని తెలిపారు. రైతుల సమస్యలు తీర్చడంలో తాను ముందుంటానని తెలిపారు. ప్రతీ ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు గొడుగు రాజయ్య, అరుట్ల సందీప్ రెడ్డి, దైద ఎలిషన్, పల్లె రవీందర్, మంద రాజు, నెలమంచ అజయ్ రెడ్డి, గట్ల మల్లా రెడ్డి, కొడెపాక యాకయ్య, కత్తుల మల్లయ్య, నాగబండి సంతోష్, కొండం రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిడుగుకు బీటీ రోడ్డు నిర్మించండి
- ఎమ్మెల్యే కడియంకు గ్రామస్తుల వినతి



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న తిడుగు యువత, గ్రామస్తులు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిడుగు నుంచి గర్మిళ్లపల్లి వరకు బీటీ రోడ్డును నిర్మించాలని, గ్రామాభివృద్ధి పనులు చేపట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తిడుగు గ్రామస్తులు, యువత కోరారు. ఆదివారం హన్మకొండలో కడియంను కలిసి తిడుగు వాసులు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలిక రహదారి నిర్మాణం కాకుండా శాశ్వత పనులు చేపట్టాలని, గ్రామంలో ఓపెన్ జిమ్‌తో పాటు ఆకేరువాగులో చెక్‌డ్యాం నిర్మించాలని, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే శ్రీహరి స్పందించి మాట్లాడుతూ శాశ్వత బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు యువత, గ్రామస్తులు కోరిన మేరకు గ్రామాభివృద్ధి పనులను త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా అంకితబావంతో పని చేస్తానన్నారు.

ఎన్నికల సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింధె రామోజీ

కొడకండ్ల ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) :ఈ నెల 11 న నిర్వహించు సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఆ పార్టీ మండలాధ్యక్షుడు సిందె రామోజీ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు త్వరలో రానున్న నేపథ్యంలో మండలకేంద్రంలోని మార్కండేయభవన్‌లో ఈ నెల 11 న ఏర్పాటు చేస్తున్న ఎన్నికల సమావేశంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎంపీటీసీ క్లస్టర్ వారీగా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేస్తారన్నారు. అందుకోసం ప్రతీ గ్రామం నుండి 100 కు తగ్గకుండా కార్యకర్తలు ఉదయం హాజరు కావాలని సూచించారు. కార్యకర్తలు ఐక్యతంగా ఉండి పార్టీ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎర్రబెల్లి సూచనల మేరకు పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు, నాయకులు డి.వెంకటేశ్వరరావు, మసురం వెంకట నారాయణ ఎండీ ఆసిఫ్, బాకీ ప్రేమ్‌కుమార్, జక్కుల ప్రభాకర్, సతీష్, మంగ్యా, హరీష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఖరిపై నిరసనలు



బచ్చన్నపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రమైన బచ్చన్నపేటలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలను ముంచేదిగా ఉందన్నారు. ఈ నెల 10న ఇందిరాపార్కు వద్ద జరిగే ఆందోళనకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో తాడెం రాములు, ఇంజె ఎల్లయ్య, సమ్మయ్య, మణెమ్మ, కళమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



స్టేషన్ ఘన్‌పూర్ విద్యార్థులు కరాటేలో బహుమతులు అందుకుంటున్న దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే పోటీల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంత విద్యార్థులు ప్రతిభ చూపారు. న్యూ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్ నగర్‌లో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఘన్‌పూర్, తాటికొండ, చాగల్లు హైస్కూళ్ల బాలికలు కటాస్ విభాగంలో ఉత్తమ ప్రతిభ చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. సినీ హీరో భానుచందర్ చేతుల మీదుగా గెలుపొందిన అండర్ 14, అండర్ 12 గ్రూప్ బీలో, గ్రూప్‌ఏలో, అండర్ 10 గ్రూప్ బాలికలు బహుమతులు అందుకున్నారని కరాటే మాస్టర్లు పెసరు సారయ్య, వంగ శ్రీనివాస్, రజాక్, జావీద్ తెలిపారు. విజేతలను వారితో పాటు హెచ్ఎంలు అభినందించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి : డీటీఎఫ్

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని.. వాటి సాధనకు కృషి చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్), ఆవోపా మండల అధ్యక్షులు అంచూరి సురేశ్, బెలిదె పూర్ణచందర్ అన్నారు. డీటీఎఫ్, ఆవోపా మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జఫర్‌గడ్‌లోని ఆర్యవైశ్య భవనంలో మండల స్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి విద్యార్థులు ఆయా సబ్జెక్టులు, పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని సూచించా రు. ప్రణాళికాబద్ధంగా చదువాలని తెలిపారు. కాగా, టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన చిలువేరు మౌనశ్రీ, సము ద్రాల తేజస్విని (తమ్మడపల్లి(జి) హైస్కూల్), జబీన్ ఫాతిమా (జఫర్ గడ్ జడ్పీ హైస్కూల్) బాలికలకు బహుమతులను అందించారు. సంఘాల ప్రతినిధులు చిలుకమర్రి వెంకటాచార్యులు, దొడ్డ రాజ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, గందె సోమన్న, బజ్జూరి మెడికల్ కృష్ణమూర్తి, బెలిదె హరిశంకర్, అక్షిత్, అజిత్‌ఖాన్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీపీఎం నేతల ఓదార్పు



ఈరవెన్నులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

పాలకుర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈరవెన్ను గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జక్కుల గట్టమ్మ, గూడూరు గ్రామానికి చెందిన బెల్లి ఎర్రయ్య మృతి చెందగా ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి సందర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ ఎర్రయ్య, గట్టమ్మ మృతికి సీపీఎం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాచ్చె సారయ్య, చిట్యాల సోమయ్య, ఏదునూరి మదార్, జ్యోతి ఉపేందర్, బెల్లి సంపత్, భాస్కర్, నాయిని శ్రీను, యాదనాల చిరంజీవి తదితరులు ఉన్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



మల్లేశ్ కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : జఫర్‌గడ్ మండల కేంద్రానికి చెందిన మొగిలిపాక మల్లేశం ఇటీవల ఆకస్మిక మరణం చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ పేద కుటుంబ దయనీయ ఆర్థిక జీవన పరిస్థితులపై అతడి చిన్న నాటి మిత్రులు స్పందించారు. జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్‌లో మల్లేశ్‌తో కలిసి చదువుకున్న 1997-1998 టెన్త్ బ్యాచ్ బాల్య మిత్రులంతా సంఘటితమై ఆర్థిక చేయూతనందించేందుకు సంకల్పించారు. తలా కొంత డబ్బును పోగు చేసుకుని ఆదివారం బాధితుల ఇంటికి వెళ్లి మొత్తం రూ.31వేలు నగదును మల్లేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మల్లేశ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. బాల్య మిత్రులు ఎ.మదన్‌మోహన్, కుల్ల రాజు, టి.వరుణ్, మంచాల సంపత్, బైరి రవి, సిహెచ్. సతీష్వర్‌రెడ్డి, కె.సోమేశ్వర్, కె.సతీష్, కన్న రాజ్‌కుమార్, హుసేన్, భాస్కర్, రొడ్డ రాజు, ఇల్లందుల రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నేత మృతి
- పలువురి నివాళి



శ్యామ్‌కుమార్‌రెడ్డి పాడె మోస్తున్న ఎమ్మెల్యే కడియం, జంగా రాఘవరెడ్డి

చిలుపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మారెపల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య ఆదివారం వేర్వేరుగా గ్రామానికి చేరుకున్నారు. మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం శ్యామ్‌కుమార్ రెడ్డి పాడెను మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారి వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, బెలిదె వెంకన్న, తోట వెంకన్న, దైద ఎలిషన్, గడ్డమీది సురేశ్, లింగారెడ్డి, రంజిత్‌రెడ్డి, బాలరాజు, రమేష్, సంపత్, ఎన్నకూస కుమార్, బత్తుల రాజన్‌బాబు, జనగామ యాదగిరి, యాదవరెడ్డి, రాకేశ్‌రెడ్డి, వెంకటస్వామి, రాజ మహేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

అరూరికి బిషప్ బాల శౌరి రెడ్డి, మేయర్ పరామర్శ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను ఆదివారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్ ఉడుముల బాలశౌరెడ్డి, ప్రతినిధి కరుణాకర్‌రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, తదితరులు పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లులో ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. వారితో పాటు బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు జువారి రమేశ్, నేతలు యాకూబ్ పాషా, పెండ్యాల సమ్మయ్య, జాఫర్, వివిధ పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. రమేశ్ కుటుంబసభ్యులను పరామ ర్శించారు. తమ సానుభూతిని తెలియజేశారు.





అరూరి వెంకటమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న బిషప్ ఉడుముల బాల శౌరెడ్డి, బీజేపీనాయకులు హుస్సేన్ నాయక్ తదితరులు